సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం। 10। జూలై। 2023



ప్రకృతి సాగుతో మేలు
ప్రకృతి విధానంలో సాగు చేస్తే ఆరోగ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు సూచించారు. 8లో



కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి
కార్పొరేట్‌కు దీటుగా కేజీహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ తెలిపారు. 8లో



గంజాయి ముఠా సభ్యుడి అరెస్ట్
గంజాయి కేసులో అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

కిలో టమాటా @ రూ.200



వారపు సంతలో అమ్మకానికి టమాటా

అరకులోయ టౌన్: టమాటా ధర రోజు రోజుకు ఆకాశాన్నంటుతోంది. ఆదివారం మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో కిలో రూ.200కు విక్రయించారు. రెండు వారాలుగా టమాటా ధర ఏమాత్రం తగ్గడం లేదు. వ్యాపారులు సిండికేట్‌గా మారి కృత్రిమ కొరత సృష్టించి కూరగాయలకు ధర పెంచేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇటుకల లోడు లారీ బోల్తా



బోల్తా కొట్టిన లారీ

అరకులోయ టౌన్: మండలంలోని కొత్తబలుగుడ గ్రామ సమీపంలోని మలుపువద్ద ఆదివారం ఉదయం ఇటుకలలోడు లారీ అదుపుతప్పింది. చెట్టును ఢీకొని బోల్తాపడింది. యలమంచిలి నుంచి లైట్ వెయిట్ ఇటుకల లోడుతో అరకులోయ బయలుదేరిన లారీ కొత్తబలుగుడ సమీపంలోని మలుపువద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో అదుపుతప్పి లారీని ఢీకొని బోల్తా కొట్టిందని డ్రైవర్ నాగేంద్ర తెలిపాడు. లారీలో ఉన్న అతనితోపాటు నలుగురు కూలీలు సురక్షితంగా బయటపడ్డారు.

అదుపుతప్పి వ్యాన్ బోల్తా



ప్రమాదానికి గురైన వ్యాన్

అనంతగిరి: మండలంలోని తైడ సమీపంలోని ఆదివారం వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. సుంకరమెట్ట వారపు సంత నుంచి మామిడి, పనసకాయల లోడుతో వెళ్తుండగా తైడ సమీపంలో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

నవంబర్ 18,19 తేదీల్లో స్వర్ణోత్సవాలు



సమావేశమైన స్వర్ణోత్సవాల సన్నాహక కమిటీ సభ్యులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలను నవంబర్ 18, 19 తేదీల్లో నిర్వహించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఇందుకోసం స్వర్ణోత్సవాల సన్నాహక కమిటీగా ఏర్పడిన ఔత్సాహికులు ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. ప్రెస్ అకాడమి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (అమరావతి) ఎస్. శ్రీనివాస్ జీవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు సూర్యప్రకాష్, శివరామచంద్రరాజు, శ్రీహరి, సూరిబాబు, ఇమ్మానియేలు, నాగేంద్ర, రాజ్ బుంగా, లక్ష్మి, సావిత్రి, బషీరా, వర్మ, శ్రీనివాస్, శేషువులు, బషీర్, గపూర్, కొండలరావు, నాగేశ్వర్రావు, ఆచార్యులు, ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



చెరకుంపాలెం వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం జంక్షన్ వద్ద నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. ఇంజన్ నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బస్సులో 33 మంది ప్రయాణికులను కండక్టర్ కిందికి దించి వేరే బస్సుల్లో గమ్యస్థానాలకు తరలించారు. ఈ బస్సు మారేడుమిల్లి నుంచి నర్సీపట్నం చేరుకోవాల్సి ఉండగా సాయంకాలం ఐదు గంటలకు మార్గమధ్యలో ఎటూ కదలకుండా మొరాయించింది. కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ఈ ప్రాంతీయులు కోరారు.

నాడు-నేడుకు తోడుగా..

- పీఎంశ్రీ పథకంలో 15 పాఠశాలల ఎంపిక
- కేంద్రప్రభుత్వం నుంచి నేరుగా నిధులు



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన చింతూరు మండలంలోని నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల

చింతూరు: విద్యాభివృద్ధికి చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే నాడు-నేడు పథకంలో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది. దీనికి కేంద్రం కూడా ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం ద్వారా సహకారం అందించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఈ పథకం కింద జిల్లాలో 15 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటికి ఐదేళ్ల వరకు ఆర్థికంగా, సాంకేతికంగా కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వనుంది. దీంతో అదనపు వసతులు సమకూరనున్నాయి.

ప్రయోజనాలు ఇలా..

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయిస్తుంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపు, ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడాసామగ్రి తదితర వసతులను కల్పిస్తుంది. ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుంది. డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలకు తోడ్పాటునిస్తుంది. విడతల వారీగా మంజూరయ్యే నిధులతో విద్యార్థులకు అవసరమైన పరికరాలను సమకూర్చుకునే వెసులుబాటు ఉంటుంది.

బోధనా పద్ధతులు ఇలా..

నాడు-నేడు ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే సాంకేతిక విప్లవం కొనసాగుతోంది. దీనికి కొనసాగింపుగా కేంద్ర ప్రభుత్వం సైతం పీఎంశ్రీ పథకంలో నూతన పద్ధతుల్లో బోధనకు చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా బోధనా పద్ధతులను నాలుగు విధాలుగా విభజించారు. ఫౌండేషనల్, ప్రిపరేటరీ, ఇంటర్మీడియెట్, సెకండరీ లెవల్స్‌లో బోధన చేయనున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో పఠనాశక్తి మెరుగుపడుతుంది.

ఎంపికైన పాఠశాలలు

జి.మాడుగులలో ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ (బాలురు), జీకే వీధి మండలంలో రింతాడ జీటీడబ్ల్యూఏఎస్ (బాలికలు), హుకుంపేట మండలంలో పెద్దగరువు జీటీడబ్ల్యూఏఎస్ (బాలికలు), కొయ్యూరు జీటీడబ్ల్యూఏఎస్- 1 (బాలురు), పెదబయలు ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ (బాలురు), అనంతగిరిలో చిలకలగెడ్డ జీటీడబ్ల్యూఏఎస్ (బాలురు), కూనవరం ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్, మారేడుమిల్లి ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్, పాడేరులోని తలారిసింగి జీటీడబ్ల్యూఏఎస్ (బాలురు), రంపచోడవరం ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్, అరకువ్యాలీలో రవ్వలగూడ జీటీడబ్ల్యూఏఎస్, చింతూరులో నర్సింహపురం ఏజీహెచ్‌ఎస్ (బాలికలు), గంగవరం జీటీడబ్ల్యూఏఎస్ (బాలికలు), దుంబ్రిగుడ జీటీడబ్ల్యూఏఎస్ (బాలికలు).

మంచి పరిణామం



జిల్లాలో 15 పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడం మంచి పరిణామం. దీనివల్ల ఆయా పాఠశాలల్లో నాడు-నేడుకు తోడుగా ఆధునిక వసతులు అందుబాటులోకి వస్తాయి. విద్యారంగం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి.

– సలీంబాషా,
జిల్లా విద్యాశాఖాధికారి, పాడేరు

శాకంబరిగా మోదమ్మ

- కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలకంకరణ
- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతుల తొలి పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తజనం



కూరగాయలతో అలంకరించిన అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న పాడేరు ఏఎస్పీ ధిరాజ్ దంపతులు



భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,డాక్టర్ నర్సింగరావు దంపతులు

సాక్షి,పాడేరు : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆదివారం శాకంబరి అలంకరణతో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు దంపతులు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన విగ్రహాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పలు పండ్ల జాతులతో అందంగా అలంకరించారు. ఆదివారం వేకువజామున ఆలయ అర్చకుడు సుబ్రమణ్యశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. పాడేరు ఏఎస్పీ ధిరాజ్ దంపతులు పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. అన్నసమారాధనను ఎమ్మెల్యే దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రారంభించారు.

అరకులోయలో హైకోర్టు జడ్జి

పర్యాటక ప్రాంతాల సందర్శన



జస్టిస్ దుర్గాప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గార్డెన్ మేనేజర్ బొంజుబాబు

అరకులోయ టౌన్ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు కుటుంబ సమేతంగా పర్యటించారు. ఉదయం విశాఖపట్నం నుంచి కిరండూల్ రైలులో ఇక్కడికి చేరుకున్న ఆయన పద్మాపురం ఉద్యానవనంలో టోయ్‌ట్రైన్‌లో గార్డెన్ అందాలను తిలకించారు. గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. గిరిజనుల జీవనవిధానంపై ఏర్పాటు చేసిన గిరిజన సంప్రదాయ కళాకృతులను తిలకించారు. గిరిజన సంప్రదాయాల గురించి నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఏపీటీడీసీ పున్నమి రిసార్ట్స్‌కు చేరుకున్నారు. భోజనం అనంతరం అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆయన వెంట జిల్లా న్యాయమూర్తి గిరిధర్, అదనపు జిల్లా న్యాయమూర్తి గోవర్ధన్, అరకులోయ ఇన్‌చార్జీ న్యాయమూర్తి ఎమ్.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గిరిజనాభివృద్ధి



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, వేదికపై ఎమ్మెల్సీ అనంతబాబు



సభకు హాజరైన ప్రజలు

- 48 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు
- ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే
- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- కూనవరం సభకు భారీగా తరలివచ్చిన జనం

కూనవరం: గిరిజన ప్రాంత అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిఅన్నారు. నాలుగు విలీన మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కొండపోడు భూములు 48 వేల ఎకరాలకు పట్టాలిచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అభివృద్ధి సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనంగా అందిస్తున్న సుపరిపాలన నిలుస్తుందన్నారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్(బాబు) మాట్లాడుతూ ప్రతీ పేదవాడు సుఖంగా జీవిస్తున్నాడంటే సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క పథకం ద్వారా నైనా కనీసం రూ.5 వేలు లబ్ధి పొందిన దాఖలాలు ఉన్నాయని ప్రశ్నించారు.

టీడీపీ తప్పిదం వల్లే వరద ముప్పు

గత టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ముందుగా కాఫర్ డ్యామ్ కట్టడం మూలంగానే వరద ముప్పు సంభవించిందని తద్వారా ముంపు గ్రామాలకు తీవ్ర నష్టం జరిగిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (బాబు) పేర్కొన్నారు. ఈ తప్పిదాన్ని తమ ప్రభుత్వంపై వేసేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఆ నిధులు దారి మళ్లించి జేబులు నిపుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వాసితులకు ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. చిత్తశుద్ధిలేని చంద్రబాబు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాకే ప్రాజెక్ట్ పనులు చేపడితే ఈ బాధలుండేవి కాదన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో టీడీపీకి డిపాజిట్లు గల్లంతవడం ఖాయమన్నారు. ఆ భయంతోనే వైఎస్సార్‌సీపీ సభలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎన్నిపార్టీలు ఏకమైనా ఈ నియోజకవర్గంలో ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీకే పట్టం కడతారని వారు ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, స్థానిక ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ఆవుల మరియాదాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ కొమ్మాని అనంత లక్ష్మి, యాదవ, మేరుకుల, ఆర్య కటిక కార్పొరేషన్ల డైరెక్టర్లు ఆవుల మాధవీరాణి, డి.గంగాధర్, ఏ.వెంకటరామారావు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, మాజీ వైస్ ఎంపీపీ గుజ్జా బాబు, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలతోపాటు పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు నిర్వహించిన బహిరంగ సభను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారంపై పోలీసులు అప్రమత్తమయ్యారు. టీడీపీ, బీజేపీ నేతలను హౌస్ అరెస్టు చేశారు.

టీడీపీ కుట్ర భగ్నం

ఎటపాక: ఎమ్మెల్సీ అనంత బాబు కూనవరం మండలంలో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభను అడ్డుకునేందుకు టీడీపీ కుట్రలు చేసింది. నెల్లిపాక వద్ద జాతీయరహదారిపై టీడీపీ నాయకులు ఆందోళన చేస్తూ సభకు వెళ్లే వాహనాలను అడ్డుకున్నారు. తరువాత వాహనాల్లో కూనవరం వెళ్లేందుకు వారు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరితో పాటు మిగతా ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సభ ముగిసిన అనంతరం విడిచి పెడతామని పోలీసులు తెలిపారు.

డెంగ్యూ నివారణే లక్ష్యంగా వైద్యసేవలు

- వైద్య ఆరోగ్య కార్యక్రమాలు మరింత విస్తృతం
- రాష్ట్ర హెల్త్ సెక్రటరీ డాక్టర్ రామిరెడ్డి



డెంగ్యూ నివారణ మాసోత్సవాల ర్యాలీని నిర్వహిస్తున్న రాష్ట్ర హెల్త్ సెక్రటరీ, ఇతర వైద్యశాఖ అధికారులు

సాక్షి, పాడేరు: జిల్లాలో డెంగ్యూతో పాటు కీటకజనిత వ్యాధుల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేశామని రాష్ట్ర హెల్త్ సెక్రటరీ డాక్టర్ వి.రామిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరులో డెంగ్యూ నివారణ మాసోత్సవాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ బృందాలతో పాడేరు ఐటీడీఏ నుంచి పాతబస్టాండ్ అంబేద్కర్ సెంటర్ వరకు డెంగ్యూ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా తగిన ఆరోగ్య సేవలను అందుబాటులో ఉంచామన్నారు. దోమల నివారణ మందు పిచికారి పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. రెండవ విడత పనులు కూడా సకాలంలో పూర్తి చేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 10వతేదీ నుంచి జిల్లాలోని అన్నిచోట్ల ఇంటింటా మళ్లీ ఫీవర్ సర్వే చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా మలేరియా అధికారి సాంబశివ, ఇతర వైద్య ఆరోగ్యశాఖ బృందాలు పాల్గొన్నాయి.

300 మందికి వైద్యసేవలు



కంటి పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ వద్ద వైద్యశిబిరం నిర్వహించినట్టు పరిజ్ఞానందజీ మహారాజ్ తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్యులు తలారి వెంకట సుబ్బారావు, శ్రీనివాస్, రాయుడు, భాస్కర్ వైద్య సేవలు అందించారు. రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారు సుమారు 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో18 మందికి కంటిద్దాలు అందజేశారు. ఐదుగురుని క్యాటరాక్ట్ ఆపరేషన్ నిమిత్తం వేమగిరి తరలించారు. డాక్టర్ గోపాలం శివన్నారాయణ బృందం సుమారు 80 మంది మూర్ఛ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేశారు. వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్టు వారు పేర్కొన్నారు. రామకృష్ణ మిషన్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్లు భగీరథరాజు, సాయిరాజు, గాధి రాజు వెంకటలక్ష్మి సేవలందించారు.

వైద్యసేవలపై డీఎంహెచ్‌వో ఆరా



వైద్యసేవల వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

దుంబ్రిగుడ: మండల కేంద్రం దుంబ్రిగుడలో ఆదివారం డీఎంహెచ్‌వో జమాల్‌బాషా పర్యటించారు. కాలనీల్లో ఇంటింటికి వెళ్లి పీహెచ్‌సీ ద్వారా గ్రామాల్లో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన గిరిజనులకు సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన రైతుకూలీ సంఘ ప్రతినిధులు

రంపచోడవరం: అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ రంపచోడవరంలో ఆదివారం సమావేశమై ప్రజల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి కత్తుల బాలు రెడ్డి అధ్యక్షత వహించారు. ఏఐకేఎంఎస్ కేంద్ర కమిటీ ప్రతినిధి పి.టాన్యా హాజరయ్యారు. ఈ సమావేశంలో గిరిజనుల రైతులకు ఉచితంగా పురుగు మందులు అందజేయాలని కోరారు. భూపతిపాలెం, పోలవరం ప్రాజెక్టుల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పూర్తిగా అందించాలని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. జిల్లా నాయకులు పల్లాల అశోక్, బాలుదొర, బాలరెడ్డి, దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి, అనసూయ, జోగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాల నురగలా పరుగులు

- వెలుగులోకి వచ్చిన నెమలి జలపాతాలు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికుల వినతి



ఆకట్టుకుంటున్న దిగువ నెమలి జలపాతం



జాలువారుతున్న ఎగువ నెమలి జలపాతం

ముంచంగిపుట్టు: దివి నుంచి జాలువారుతున్నట్టు..పాల నురగల మాదిరిగా నీటి ప్రవాహం పరుగులు పెడుతూ మంత్రముగ్ధులను చేస్తున్నాయి తాజాగా వెలుగులోకి వచ్చిన నెమలి జలపాతాలు. మండలంలోని బూసిపుట్టు పంచాయితీ సంతవిధి, దోనిపుట్టు గ్రామాల సమీపంలో ఎత్తయిన కొండల నడుమ జాలువారుతున్నాయి ఈ రెండు జలపాతాలు. ఇవి పక్కపక్కనే ఉన్నందున పర్యాటకులకు ఒకేసారి రెండు జలపాతాలను చూసిన అనుభూతి దక్కుతుంది. ఆదివారం అతికష్టం మీద సంతవీధి, దోనిపుట్టు గ్రామ గిరిజనుల సహకారంతో ఎగువ, దిగువ నెమలి జలపాతాల అందాలను సాక్షి కెమెరా బంధించింది. ఈ సందర్భంగా అందమైన జలపాతాలకు వెళ్లేందుకు సరియైన మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని పరిసర ప్రాంతీయులు పేర్కొన్నారు. సంతవీధి నుంచి దోనిపుట్టు మీదుగా కొండ మార్గం గుండా రెండు జలపాతాలకు ఉపాధి హామీలో రహదారి ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు. గతంలో ఈ రెండు జలపాతాల వద్ద నెమళ్లు నాట్యమాడేవని, అందుకు వీటికి నెమలి జలపాతాలుగా పేర్లు వచ్చాయని వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పడవ బోల్తా.. మత్స్యకారులు క్షేమం



భీమిలి తీరానికి చేరుకున్న మత్స్యకారులు

భీమునిపట్నం: భీమిలి తీరానికి సమీపంలో ఆదివారం మత్స్యకారుల పడవ బోల్తాపడింది. బోయివీధికి చెందిన కదిరి అప్పలరాజు, కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, కాసారు పెంటరాజు, తెడ్డు గొర్లయ్య, కదిరి రాజు, కాసరపు నూకరాజు, కాసరపు ఎల్లాజీ పడవలో చేపల వేటకు బయలుదేరారు. తీరానికి కొద్ది దూరం వెళ్లిన తర్వాత అలలు ఉధృతంగా రావడంతో పడవ బోల్తా పడిపోయింది. వెంటనే వీరందరూ జాగ్రత్తగా తీరానికి చేరుకున్నారు. పడవ, దానికి ఉన్న ఇంజిన్‌ను ఇతర మత్స్యకారుల సాయంతో తీరానికి తీసుకొచ్చారు.

ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు గానీ.. పడవ, ఇంజిన్ దెబ్బ తినడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని మత్స్యకారులు తెలిపారు. వీరిని స్థానిక నాయకుడు కదిరి ఎల్లాజీ పరామర్శించారు. వీరందరూ నిరుపేదలని, జరిగిన నష్టానికి ప్రభుత్వ సాయం అందించాలని కోరారు.

వ్యాన్ బోల్తా



అదుపు తప్పి పొలాల్లో బోల్తాపడిన వ్యాన్

రావికమతం: మండల కేంద్రం రావికమతం నుంచి కింతలి వెళ్తున్న బొలేరో వ్యాన్ మత్స్యపురం ఎర్రిగెడ్డ సమీపంలో ఆదివారం బోల్తా పడింది. పొలాల్లోకి దూసుకుపోయి పల్టీలు కొట్టింది. డ్రైవర్ ఈశ్వరరావు చాకచక్యంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బ్రేక్ ఫెయిల్ కావడంతో వాహనం అదుపుతప్పినట్టు డ్రైవర్ తెలిపాడు.

జోరందుకున్న తొలకరి పనులు

- నారుమడులు సిద్ధం
- పనుల్లో రైతులు నిమగ్నం



రాజవొమ్మంగిలో వరి నారుమడి చుట్టు రక్షణగా ప్లాస్టిక్ తెరలు ఏర్పాటు చేసిన దృశ్యం

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా ఖరీఫ్ వరినారుమళ్ళ తయారీలో రైతన్నలు బిజీ అయ్యారు. మండలంలో దాదాపు 5,600 ఎకరాల్లో వరి సాగవుతోంది. వరి విత్తనాలను వెదజల్లే ముందు ప్రభుత్వం సరఫరా చేసిన సూడోమోనాస్ పొడి మందుతో విత్తనశుద్ధి చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు సుమారు 3వేల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు వీలుగా వరి నారుమడులు వేశారు. మరో 24 రోజుల్లో నారు సిద్ధం కావచ్చని, అందుకు అనుగుణంగా పొలాలను ఇప్పటి నుంచి దమ్ములు చేస్తున్నామని రైతులు చెపుతున్నారు.

పశువుల నుంచి కాపాడుకొనేందుకు

వరి నారుమడులు వేసిన రైతులు వాటిని పశువుల నుంచి కాపాడుకొనేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. వరి నారుమడి వేసి ప్రాంతంలో చుట్టు చీరలు, ప్లాస్టిక్ తెరలు కట్టి కాపాడుకొంటున్నారు. తొలకరి వచ్చినా పశువులను కట్టడి చేయకపోవడం రైతులకు శాపంగా మారింది. ఇప్పటికే అడవి జంతువులు, కోతుల నుంచి పంటలను కాపాడుకోలేకపోతున్న రైతాంగం విచ్చలవిడిగా వదిలిపెడుతున్న పశువుల వల్ల మరింత నష్టపోతు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పశువులను కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి పంచాయతీలో బందీల దొడ్డి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

వెదజల్లు పద్ధతికే ప్రాధాన్యం

ఈ ఏడాది అధిక శాతం రైతులు వరి నారుమడులు వేసేందుకు విముఖత చూపుతున్నారు. నేరుగా వెదజల్లు పద్ధతిలోనే వరి సాగుచేపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వెదజల్లు పద్ధతిలో నారు మడి ఖర్చు రూ.3వేలు, ఆకు తీత ఖర్చు రూ.3వేలు, మోత ఖర్చు రూ.వెయ్యి, నాట్లు వేసే కూలీల ఖర్చు రూ.4వేలు వెరసి రూ.12వేలు కలిసి వస్తోందని రైతులు భావిస్తున్నారు. దీంతో ఈ ఏడాది అధిక శాతం రైతులు వెదజల్లు పద్ధతికే మొగ్గుచూపుతున్నారు.

పరువుపోయిందనే ఆత్మహత్య

డి.కొత్తూరు ఘటన వివరాలు వెల్లడించిన సీఐ సుధాకర్



వివరాలు వెల్లడిస్తున్న పాడేరు సీఐ సుధాకర్

పాడేరు రూరల్: మండలంలోని దేవాపురం పంచాయతీ డి.కొత్తూరులో తన పరువుపోయిందనే కారణంతోనే ఈనెల 7వ తేదీ రాత్రి కొండపల్లి కొండలరావు నాటు తుపాకీతో కాల్చుకుని మృతి చెందాడని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. పాడేరులోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 7న డి. కొత్తూరు గ్రామానికి చెందిన కొండపల్లి లక్ష్మి, కొండపల్లి కొండలరావు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో కొండలరావు తనపై లైంగికదాడి చేయబోయాడని ఆరోపిస్తూ పంచాయతీ పెట్టేందుకు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లక్ష్మి చెప్పిందన్నారు. అదేరోజు కొండలరావు తన వద్ద ఉన్న నాటుతుపాకీ పట్టికొని లక్ష్మి ఇంటికి వెళ్లాడని, తన పరువు ఎందుకు తీస్తున్నావని ఆమెతో పాటు ఆమె భర్త రామకృష్ణతో గొడవ పడ్డాడని తెలిపారు. అవమానం భరించలేకనే కొండలరావు నాటుతుపాకీతో మెడవద్ద కాల్చుకొని మృతి చెందాడని సీఐ తెలిపారు. అయితే లక్ష్మి, ఆమె భర్త రామకృష్ణ కాల్చి చంపి ఉంటారనే అనుమానంతో కొండలరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని చెప్పారు. నాటుతుపాకీల వినియోగం చట్టరీత్యా నేరమని, గిరిజనులు వేటకు ఉపయోగించే నాటుతుపాకులను స్వచ్ఛందంగా తమకు అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐలు లక్ష్మణ్‌రావు, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా కేజీహెచ్ అభివృద్ధి

- రూ.2.50 కోట్లతో కొనసాగుతున్న పనులు
- నేటి నుంచి ఓపెన్ హార్ట్ సర్జరీలు ప్రారంభం
- ఆస్పత్రికి చేరుకున్న రూ.5కోట్ల సి.టి.స్కాన్ మెషీన్
- ఎంఆర్ఐ స్కాన్ మెషీన్ కూడా మంజూరు
- త్వరలో కంప్యూటర్ ఆధారిత సేవలు
- కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ వెల్లడి



మహారాణిపేట: కార్పొరేట్‌కు దీటుగా కేజీహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. రూ.2.50కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సి.టి.స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ మెషీన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. కేజీహెచ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన సి.టి.స్కాన్ పరికరం కేజీహెచ్‌కు చేరుకుందని, గైనిక్ విభాగం ఎదురుగా ఈ పరికరాన్ని అమర్చుతున్నట్లు చెప్పారు. రూ.10 కోట్ల విలువైన ఎంఆర్ఐ స్కాన్ మిషన్ త్వరలోనే చేరుతుందని.. ఈ రెండు పరికరాలను రేడియాలజీ విభాగాధిపతి పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

ఓ రోగికి నేడు ఓపెన్ హార్ట్ సర్జరీ

కేజీహెచ్‌లో ఈ ఏడాది మార్చి 24న మిషన్ మరమ్మతుకు గురికావడంతో ఓపెన్ హార్ట్ సర్జరీలు నిలిచిపోయాయని, కొత్తగా రూ.50 లక్షల వ్యయంతో టెంపరేచర్ కంట్రోల్ మెషీన్(టీసీఎం) అమర్చినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. శనివారం ట్రయల్ పూర్తయిందని, సోమవారం ఓ రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి(హెచ్‌వోడీ) డాక్టర్ కె.మణిత ఆధ్వర్యంలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఓపెన్ హార్ట్ సర్జరీల కోసం 10 కేసులు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

నేటి నుంచి రెండో క్యాజువాలిటీ నిర్మాణం

ప్రస్తుతం ఉన్న క్యాజువాలిటీ రోగులకు సరిపోకపోవడంతో.. మరో క్యాజువాలిటీ నిర్మాణానికి కలెక్టర్ అనుమతి ఇచ్చారని డాక్టర్ శివానంద్ తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీసీ) నుంచి రూ.30 లక్షలు మంజూరవడంతో.. సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం 20 పడకలు ఉండగా, రెండో క్యాజువాలిటీ నిర్మాణంతో మరో 20 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. క్యాజువాలిటీ మేడ మీద ఐసోలేషన్ వార్డులో మరో 10 పడకలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తర్వాత ఒక్కో విభాగానికి కొన్ని పడకలు చొప్పున కేటాయిస్తామన్నారు.

పిల్లల వార్డులో రెండు యూనిట్లు

పిల్లల వార్డులో రూ.70 లక్షల వ్యయంతో రెండు యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎన్ఐసీయూ), ప్రత్యేక నవజాత సంరక్షణ యూనిట్(ఎస్ఎన్‌సీయూ) నిర్మాణ పనులు చేపట్టామన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

రూ.50 లక్షలతో సౌర విద్యుత్

కేజీహెచ్‌లో విద్యుత్ సమస్య పరిష్కారానికి 120 కేవీ సౌర విద్యుత్ ఉత్పాదన కోసం ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో ఒప్పందం కుదిరిందని, రూ.50 లక్షలతో త్వరలో పనులు ప్రారంభమవుతాయని సూపరింటెండెంట్ వెల్లడించారు. ఈ నిర్మాణం పూర్తయితే కేజీహెచ్‌కు విద్యుత్ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. ఆస్పత్రిలో జనన, మరణ వివరాలను కంప్యూటర్‌లో ఫీడ్ చేస్తున్నామని.. దీని వల్ల అవసరమైన సర్టిఫికెట్లు జారీ సులవవుతుందన్నారు. స్టేట్ బ్యాంక్ ఇండియా సీఎస్సార్ కింద రూ.50 లక్షలు మంజూరు చేసిందని, దీనికి కలెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు. ఓపీ చిటీలు, మెడికల్ రికార్డులు, వివిధ పరీక్షల నివేదికలు అన్ని రోగి సెల్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ కూడా ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, వైద్య పరీక్షల కేంద్రాల్లో ఈ పద్ధతి అమలులో ఉందని, త్వరలో కేజీహెచ్‌లో కూడా అమలు చేస్తామన్నారు.

సాయంత్రం ఓపీపై విస్తృత ప్రచారం

కేజీహెచ్‌లో అన్ని ఓపీలు సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నామని.. దీనిపై పూర్తిస్థాయిలో ప్రచారం చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. ఇందుకోసం ఆస్పత్రిలో సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం ఓపీలు యథావిధిగా కొనసాగుతున్నాయని.. సాయంత్రం ఓపీలను కూడా రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విశాఖకు 40 కొత్త బస్సులు!

- వీటిలో 20 వరకు సూపర్ లగ్జరీలు
- పది అల్ట్రా డీలక్స్‌లు..
- మిగతావి ఏసీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- మూడు నెలల్లో రోడ్లపైకి వచ్చే అవకాశం



సాక్షి, విశాఖపట్నం: ఏపీఎస్ ఆర్టీసీ 1,500 కొత్త బస్సులను కొనుగోలు చేస్తోంది. టెండర్లు కూడా పిలిచింది. వీటిని దశల వారీగా ఆయా జిల్లాలకు కేటాయించనుంది. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లాకు 40 వరకు కొత్త బస్సులు వస్తాయని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిలో సూపర్ లగ్జరీ బస్సులు ఎక్కువగా కేటాయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం కొత్తగా కొనుగోలు చేయనున్న బస్సుల్లో సూపర్ లగ్జరీ బస్సులు అధికంగా 735 ఉన్నాయి. అందువల్ల విశాఖకు వీటి కేటాయింపు ఒకింత ఎక్కువగా ఉండనుంది. సాధారణంగా 10 లక్షల కిలోమీటర్లు ప్రయాణించిన సూపర్ లగ్జరీ బస్సులను నిలిపి వేస్తారు. వాటి స్థానంలో కొత్త బస్సులను (రీప్లేస్) కేటాయిస్తారు. ప్రస్తుతం ఆర్టీసీ విశాఖ జిల్లా పరిధిలోని వివిధ డిపోల్లో 37 సూపర్ లగ్జరీ బస్సులున్నాయి. వీటిలో సుమారు 20 బస్సులు రీప్లేస్ చేయాల్సిన స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అద్దె ప్రాతిపదికన 10 సూపర్ లగ్జరీ బస్సులను తీసుకుంటున్నారు. వీటిలో ఇటీవల రెండు బస్సులు వచ్చాయి. ఈ నేపథ్యంలో 20 కొత్త సూపర్ లగ్జరీలకు అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం 25 అల్ట్రా డీలక్స్‌లు, 20 ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీటిలో రీప్లేస్ అయ్యే అల్ట్రా డీలక్స్ బస్సులు అంతగా లేకపోయినా కొత్తగా పది బస్సులు, ఐదు వరకు ఎక్స్‌ప్రెస్‌లు వస్తాయని భావిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం 30కి పైగా వివిధ రకాల ఏసీ బస్సులున్నాయి. ఇవి 10 లక్షల కిలోమీటర్లను పూర్తి చేసుకోలేదు. అయినప్పటికీ భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొత్త బస్సుల్లో ఐదు ఏసీ బస్సులను కేటాయించవచ్చని అంటున్నారు.

కోవిడ్ ప్రభావంతో మూడేళ్లుగా కొత్త బస్సుల కొనుగోళ్లు లేవు. తాజాగా ఇప్పుడు కొనుగోళ్లు చేపట్టనుండడంతో విశాఖకు కొత్త బస్సుల కేటాయింపు ఆశాజనకంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. 10 లక్షల కిలోమీటర్లు నడిచిన సూపర్ లగ్జరీ బస్సులకు కొత్త బాడీలు కట్టి సిటీ బస్సులుగా మార్పు చేసి తిప్పుతారు. ఈ లెక్కన ఇలాంటి బస్సులు సిటీ అవసరాలను కొంతవరకు తీరుస్తాయి. కొత్తగా కొనుగోలు చేయనున్న ఆర్టీసీ బస్సులను దశల వారీగా కేటాయిస్తారు. దీంతో అక్టోబరు నాటికి కొత్త బస్సులు రావచ్చని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణ అడ్డగింత

ఎస్.రాయవరం: చినఉప్పలం రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు.

ఈ గ్రామంలో కొండ పోరంబోకు, బీచ్‌ను అనుకుని సోషల్ ఫారెస్టు భూములు వేలాది ఎకరాలున్నాయి. ఈ భూములను కొందరు గుట్టు చప్పుడు కాకుండా ఆక్రమించి, సాగు భూములుగా మార్చుకుంటున్నారు. అదేక్రమంలో జగనన్న కాలనీకి దగ్గరలో ప్రభుత్వభూమిలో రెండు రోజులుగా పెద ఉప్పలం గ్రామానికి చెందిన కొందరు చదును చేస్తుండగా అధికారులకు ఫిర్యాదు అందింది.ఈ మేరకు తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్‌లు రెవెన్యూ సిబ్బందిని అస్థలానికి పంపించి పనులు చేయకుండా ఆక్రమణదారులను అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో చాలా మంది ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆక్రమణ దారులను గుర్తించి, తొలగించాలని వారు కోరారు.

ప్రకృతి సాగుతో మేలు

జి.మాడుగుల: మండలంలో కోరాపల్లి పంచాయతీ కేంద్రంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థ ఎం.నిటాపుట్టు యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగుతో ఎంతో మేలు అన్నారు. విష రసాయనాలు లేని ఆర్గానిక్ ఆహారం మాత్రమే మన ఆరోగ్యాన్ని రక్షించిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండించాలంటే ప్రకృతి సేద్యంతోనే సాధ్యమవుతుందన్నారు. విత్తనాలు, మొక్కలు ముందుగా బీజీమృతంతో శుద్ధి చేసుకొని, వరినాట్లు వేయాలని సూచించారు. నారు శుద్ధి చేసుకుంటే తెగళ్ల నివారణ, దిగుబడి పెంచుకోవచ్చన్నారు. విషపూరితమైన రసాయన ఎరువులు వాడడం వలన భూమి, పండించిన పంట కలుషితమై అనారోగ్య సమస్యలు తలెత్తాయన్నారు. రైతులందరు ప్రకృతి వ్యవసాయం చేయటానికి దృష్టి సారించాలని ఆయన కోరారు. ఎంపీటీసీ సభ్యుడు నానాజీ, మాజీ వైస్ ఎంపీపీ సన్యాసినాయుడు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

గంజాయి ముఠా సభ్యుడి అరెస్ట్

పాడేరు రూరల్ : పాడేరు–చోడవరం ప్రధాన రహదారిలోని మోదకొండమ్మ అమ్మవారి పాదాల సమీపంలో పోతురాజు స్వామి ఆలయం మలుపు వద్ద జూన్ 25న స్వాధీనం చేసుకున్న 400 కిలోల గంజాయి కేసులో అంతరాష్ట్ర ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. గత నెల 25న కారులో గంజాయి తరలిస్తూ ఘాట్‌లో ఓ లారీని ఢీకొట్టి డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడన్నారు. ఈ ఘటనలో 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. తాజాగా గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన ఫిరోజ్ అజీజ్ భగవన్ అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ లక్ష్మణ్, రంజిత్‌ను సీఐ సుధాకర్ అభినందించారు.

పలు రైళ్ల రద్దు


తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న భద్రతాపరమైన పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గుంటూరు-విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు, విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు, కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ (17267/17268) ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ఇరువైపులా, రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండి(07466/07467) పాసింజర్ స్పెషల్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేశారు.

పలు రైళ్లు దారి మళ్లింపు : పలు రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు-ఏలూరు- విజయవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు-భీమవరం టౌన్- గుడివాడ-విజయవాడ మీదుగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 11,14,15 తేదీల్లో, టాటానగర్ - ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ ఈనెల 14వ తేదీన, హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్ ఈనెల 15 తేదీన, హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ ఈనెల 11న మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి.


పలు రైళ్లు రీషెడ్యూల్ : ఆయా స్టేషన్‌ల్లో ఆదివారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరాయి. ఆయా స్టేషన్‌లకు చేరుకోవలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో ఈ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్ - షాలిమార్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 9 గంటలకు, ఎస్ఎంవీ బెంగళూరు-జసిద్ది (22305) ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు, హౌరా-సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు, సికింద్రాబాద్ - హౌరా (12704)సుమారు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 7.55 గంటలకు బయల్దేరాయి.

43 కిలోల గంజాయి స్వాధీనం

ఆరుగురి అరెస్టు



నిందితులతో ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చంద్రశేఖర్



వివరాలు వెల్లడిస్తున్న అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు

నర్సీపట్నం: గంజాయి తరలిస్తున్న ఆరుగురిని నర్సీపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు అందించిన వివరాలు... మున్సిపాలిటీలోని పీనారపాలెం ఆంజనేయస్వామి ఆలయం మెయిన్ రోడ్డుపై సిబ్బందితో కలిసి ఆదివారం సీఐ ఎస్ఐ చంద్రశేఖర్ రూట్ వాచ్ చేశారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై బ్యాగ్‌తో వస్తుండగా అనుమానంతో వాహనం ఆపి తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. వీరు ఇచ్చిన సమాచారం మేరకు పైలెట్, గంజాయి తీసుకునేందుకు బయపురెడ్డిపాలెం వద్ద వేచి ఉన్న ఇద్దరు వ్యక్తులు, గంజాయి సరఫరా చేసిన మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రోలుగుంట మండలం, రత్నంపేటకు చెందిన పనివాడ శ్రీను(37), పూడి జనార్ధన్ (20), తమటపు సత్యనారాయణ(19), పెద్దాడ జోగింద్రరావు(19), కాకినాడ జిల్లా ఇంద్రపాలెంకు చెందిన మాధవరపు సురేష్‌బాబు(27), ఏఎస్ఆర్ జిల్లా అడ్డతీగలకు చెందిన ముత్తుకాల వీరబాబు(37)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.42 వేలు విలువ చేసే 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మూడు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

దేవరాపల్లి: ఏజెన్సీ నుంచి దేవరాపల్లి మీదుగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని శనివారం రాత్రి దేవరాపల్లి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజు విలేకరులకు వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నుంచి గంజాయిని తరలిస్తున్నట్టు స్థానిక ఎస్ఐ డి. నాగేంద్రకు సమాచారం అందింది. దీంతో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఎస్ఐ వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్రం వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ వారిని వెంబడించి ఒక వ్యక్తిని పట్టుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరి జిల్లా డెంకనికొటెట్ మండలం, కెళమంగళం గ్రామంలోని అన్నా నగర ప్రాంతానికి చెందిన రఘు యెల్లకాయప్పగా పోలీసులు గుర్తించి, అరెస్టు చేశారు. నిందితుడిని విచారించగా తమిళనాడుకు చెందిన నవీన్, వినయ్‌లు పాడేరు చెందిన గంజాయి విక్రయించే తిమోతిని సంప్రదించాలని తనకు సూచించినట్టు తెలిపాడని డీఎస్పీ చెప్పారు. రఘు యెల్లకాయప్పను చోడవరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించినట్టు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 44 వేలు ఉంటుంది. పట్టుబడిన వ్యక్తి నుంచి 6500 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్. తాతారావు, స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్టు వేసేందుకు గట్టి నిఘా ఉంచామని డీఎస్పీ వి. సుబ్బరాజు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు కె.కోటపాడు సర్కిల్ పరిధిలో 31 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో 777 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 81 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు డి.నాగేంద్ర, ఆర్. ధనుంజయ్, బి.రామకృష్ణ, పి.రామారావు, పి.దామోదర్‌నాయుడు, క్రైమ్ టీమ్‌లను ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అభినందించారని డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు.